జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

పటాన్‌చెరు, నవంబర్ 12: జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆయన కార్యాలయంలో కలిసి నిధులు కావాలని కోరారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఉపేందర్‌రెడ్డిని కలిసి పట్టణంలోని శాంతినగర్, బండ్లగూడ, బాలాజీనగర్, ఆల్విన్‌కాలనీలలో రోడ్లు వర్షంతో దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ కాలనీల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణం అత్యంత అవసరం అని చెప్పారు. జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి వివరాలు వెళ్లడించారు. రూ. కోటి 20 లక్షలు తక్షణ అవసరం ఉందని పేర్కొన్నారు. ఉపేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. పటాన్‌చెరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

డిసెంబర్ 9న భగవద్గీత కంఠస్థ పోటీలు

హత్నూర, నవంబర్ 12: టీటీడీ ఆధ్వర్యంలో డిసెంబర్ 9న హత్నూర మండలం చింతల్‌చెరు సరస్వతీ శిశుమందిర్‌లో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానచార్యులు రమేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీల్లో ఆత్మ సంయమ యోగా శ్లోకాలపై 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమతోపాటు లక్ష్మీనారాయణశర్మ టీటీడీ సంగారెడ్డి కార్యనిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ చల్ల రాజశేఖర్

జహీరాబాద్, నవంబర్ 12: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి మంగళవారం సాయంత్రం అందజేసినట్టు హద్నూర్ ఎస్ఐ చల్ల రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అక్టోబర్ 24న సున్నపు వీరన్న సెల్‌ఫోన్ పోగొటుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను కనిపెట్టి పోగొట్టుకున్న బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బందికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో హెచ్‌కానిస్టేబుల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

జహీరాబాద్, నవంబర్ 12: టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బి.సత్యనారాయణను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. జహీరాబాద్ మండలంలోని మల్చెల్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్‌ఎంగా పనిచేస్తున్న సత్యనారాయణను పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు కట్టబెట్టినందుకు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్, జిల్లా అధ్యక్షుడు అకుల మణయ్య, ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అమీన్‌పూర్, నవంబర్ 12: ఊరికి వెళ్లి వస్తానని చెప్పి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సదానాగరాజు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని గ్రీన్ విల్లాస్ నివాస్ మద్ది శ్రీనివాస్(54) కిరాణా షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల ఒకటో తేదీన మధ్యాహ్నం స్వగ్రామమైన సిద్దిపేటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద, బంధుమిత్రుల వద్ద ఎంత వెతికినా ఎలాంటి ఆచుకీ లభించలేదు. అతడి భార్య మద్ది ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేరుకే ఆదర్శం.. పారిశుధ్యం అస్తవ్యస్తం!

- మోడల్ పాఠశాలలో అధ్వానంగా పారిశుధ్యం
- చిట్టడవిని తలపిస్తున్న పాఠశాల పరిసరాలు
- పట్టించుకొనే వారులేక ఇబ్బందుల్లో విద్యార్థులు

పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారం

నాగల్‌గిద్ద, నవంబర్ 12: మండల పరిధిని మోర్గి ఆదర్శ పాఠశాల, బాలికల వసతి గృహం సమస్యలకు నిలయంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక అధ్వానంగా తయారైంది. సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి చిట్టడవిని తలపిస్తున్నది. వసతి గృహం ముందు పిచ్చి మొక్కలతోపాటు చెత్తాచెదారం అక్కడే పడేయడంతో దుర్వాసన వస్తున్నది. రాత్రివేళ దోమలు విజృంభిస్తుండడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో పాత ఉపాధ్యాయులు అంతా వేరే పాఠశాలలకు వెళ్లారు. వారి స్థానంలో మరో పాఠశాల నుంచి ఉపాధ్యాయులు చేరారు.

ఇంకా పూర్తికాని సిలబస్!

విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా పాఠ్య ప్రణాళిక సగం కూడా పూర్తి కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా సువర్ణ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విధులకు సక్రమంగా రాకపోవడం, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పట్టించకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపణాలు వస్తున్నాయి. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రుల కోరుతున్నారు.

ఇంటింటి సర్వేకు ప్రజల విముఖత

బొల్లారం: కేబీఆర్ కాలనీలో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంగతాయారు

నాగల్‌గిద్ద, నవంబర్ 12: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు అన్ని వివరాలు వెల్లడించేందుకు విముఖత చూపుతున్నారు. ముఖ్యంగా ఆస్తుల విషయంలో గోప్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో చెరుకు సీజన్ ప్రారంభం కావడంతో వారం రోజుల నుంచి గిరిజనులు వలస బాట పట్టారు. పల్లెల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతుండడంతో ప్రజలు పనులకు వెళ్లిపోతున్నారు. ఇండ్లలో ప్రజలు ఉండకపోవడంతో సర్వే ఆశించిన స్థాయిలో జరగడంలేదని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. కొంత మంది సర్వేను వ్యతిరేకిస్తున్నారు. కొన్ని చోట్ల సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు కదా.. మళ్లీ ఈ సర్వే ఎందుకంటూ పలు చోట్ల ప్రజలు ఎన్యూమరేట్లను ప్రశ్నిస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వే మందకొడిగా కొనసాగుతుండడంతో పలువురు ఆసక్తి చూపడం లేదు.

సర్వే తీరుపై కమిషనర్ ఆరా

బొల్లారం, నవంబర్ 12: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్ కాలనీలో ఇంటింటి సమగ్ర సర్వే కొనసాగుతున్న తీరును మున్సిపల్ కమిషనర్ మంగతాయారు మంగళవారం తనిఖీ చేశారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని ప్రజలను కోరారు. ఫారంలో నమోదు చేస్తున్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నిర్మలారెడ్డి, ఎన్యూమరేటర్లు నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

జోగిపేట సీఐ అనిల్‌కుమార్

హైవేపై వేగ నియంత్రణకు ఎల్లో స్టిక్కర్ డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

చౌటకూర్, నవంబర్ 12: సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్‌తో కలిసి ఆయన చౌటకూర్ మండలంలోని సుల్తాన్‌పూర్, తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద జాతీయ రహదారిని జిగ్‌జాగ్‌గా ఏర్పాటు చేశారు. హైవేపై వాహనాలు వేగంగా ప్రయాణిస్తుండంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో అనేక మంది క్షతగాత్రులవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వాహనాల వేగ నియంత్రణను తగ్గించేందుకు డ్రమ్ములకు ఎల్లో స్టిక్కర్లను అతికించడంతోపాటు బారీకేడ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. జోగిపేట సర్కిల్ పరిధిలో జాతీయ రహదారి విస్తరించి ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నష్ట నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ రహదారిపై వాహనాల వేగ నియంత్రణకు పోలీసు పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

కొండాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు

కొండాపూర్, నవంబర్ 12: మండలంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని కొండాపూర్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కొండాపూర్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాల వంటివి అమ్మినా, వారికి సహకారం అందించినా కేసులు నమోదు చేస్తామన్నారు. కొండాపూర్ సీఐగా విధులు నిర్వహించిన చంద్రయ్య మల్టీజోన్-2కు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. కొండాపూర్ సీఐ వెంకటేశ్వర్లు ఎస్సీ రూపేశ్‌ను కలిసి పూల బొకే అందజేశారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్: నారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబర్ 12: రోడ్డు ప్రమాదంలో గాయపడిన నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గంపల్లి నారాయణను మంగళవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు మల్‌గొండ, అంజాగౌడ్, మశ్చందర్, సత్యం, సాయిలు, గోపాల్ ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

కల్హేర్, నవంబర్ 12: కల్హేర్ మండలం కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి పొలం కోత కోయిస్తున్న క్రమంలో తేనెటీగలు దాడి చేశాయి. దీంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి తిరిగి రావడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకొని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు అలీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పీరయ్య, పండరి, నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, హన్మండ్లు ఉన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న భూసార నిపుణుడు స్వామి, విద్యార్థులు

జహీరాబాద్, నవంబర్ 12: రైతులు భూసార పరీక్షలు చేయించుకొని వాటికి అనుగుణంగా ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిగ దిగుబడులు సాధించవచ్చని జహీరాబాద్ మండలం దిడ్గి డెక్కన్ డెవలప్‌మెంట్-కృషి విజ్ఞాన కేంద్రం భూసార నిపుణులు డాక్టర్ స్వామి అన్నారు. మంగళవారం న్యాల్‌కల్ మండలంలోని మెటల్‌కుంటలో భూసార పరీక్షలు, లింగాకర్షక బుట్టల ప్రదర్శనపై భూసార నిపుణులు, మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్శిటీ విద్యార్థులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి, కంది పంటలను ఆశించే గులాబీ, శనగ పచ్చ చీడ పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే భూసార నిపుణులు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

రంజోల్ పాఠశాలలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

జహీరాబాద్, నవంబర్ 12: విద్యార్థులు పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ ప్రాథమిక పాఠశాలో ఏర్పాటు చేసిన రూం టూ రీడ్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలతో అనుబంధం పెంచేలా పీరియడ్ కేటాయించి సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రూం టూ రీడ్ సంస్థ పాఠశాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ రాష్ట్ర మేనేజర్ నర్సింహాచారి మాట్లాడుతూ పాఠశాలలో ప్రత్యేక గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పాఠన సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రూంటూరీడ్ సంస్థ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ తేజస్వి, మండల విద్యాధికారి బస్వరాజ్, కాంప్లెక్స్ హెచ్ఎం నాను సింగ్, లిటరసి ఫెసిలిటేటర్ రవి, విజయశ్రీ, సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

రాయికోడ్, నవంబర్ 12: వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటటీ తహసీల్దార్ విజయకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కలెక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సిబ్బంది ప్రభాకర్, నాగరాజు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

మాట్లాడుతున్న జిల్లా అధికారి శైలజ

పుల్కల్, నవంబర్ 12: ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం మండల పరిధిలోని గొంగ్లూర్ రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ, అగ్రికల్చర్ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి శైలజ హాజరై మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఎకరాకు 57 మొక్కలను రూ.20కే ఇస్తున్నదని చెప్పారు. ఎకరాకు రూ.4,200 చొప్పున రాయితీ ఇవ్వడమేకాకుండా డ్రిప్పు పరికరాలను కూడా సబ్సిడీపై అందిస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల ఉద్యాన శాఖ అధికారి సమత, ఏవో ప్రవీణ, ఏఈఓ వంశి, గోద్రేజ్ కంపెనీ ఉద్యోగి వెంకటేశ్వర్లు, అవినాష్, రైతులు రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, శివరాజ్, నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జయశ్రీరాజ్

గుమ్మడిదల, నవంబర్ 12: మండలంలోని కొత్తపల్లి, కానుకుంట గ్రామాల్లోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జయశ్రీ రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డ్స్‌ను తనిఖీ చేసి కేంద్రానికి వచ్చిన ధాన్యం వివరాలను, రైతుల వారీగా పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు పక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతులు కేంద్రానికి తీసుకు వచ్చిన ధాన్యానికి ఏఈవో వద్ద టోకెన్ తీసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన ఇద్దరు రైతులకు కొనుగోలు రసీదు అందజేశారు. కార్యక్రమములో ఏపీఎం శివకుమార్, సీసీలు కృష్ణ, మెహర్, బుక్ కీపర్లు మాదవి, కల్పన తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విరాళం అందజేస్తున్న సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్‌నాయక్

చౌటకూర్, నవంబర్ 12: మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి దాతలు రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేయాలని గ్రామానికి చెందిన పలువురు సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్‌ను కోరగా, అందుకు స్పందించిన ఆయన రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తన తండ్రి హుక్యానాయక్ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, సీడీసీ మాజీ డైరెక్టర్ జైపాల్‌నాయక్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బొమ్మరాజు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుమ్మరి సాయిలు, భూచయ్య, నర్సింహులు, ప్రభాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థినుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థినులతో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ

మునిపల్లి, నవంబర్ 12: మండల పరిధిలోని బుధేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థినులు హైదరాబాద్‌లోని ఉస్మానియ యూనివర్సిటీ క్యాంపస్‌లో నవంబర్ 9, 10 తేదీల్లో జరిగిన ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో సత్తా చాటినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. మంగళవారం బుధేరా కళాశాలలో మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఒక స్వర్ణం, నాలుగు రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

దేశ నిర్మాణంలో విద్యార్థులదే కీలకపాత్ర

విద్యార్థులకు టీషర్టు, బెల్టులు, ఐడెంటీ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

జహీరాబాద్, నవంబర్ 12: దేశ నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర అని జహీరాబాద్ మండలం కోత్తూర్(బి) జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిణి అన్నారు. మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు టీషర్టులు, ఇడెంటీకార్డులు, బెల్టులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు నగేశ్, సిద్ధన్న, బాబు, భాస్కర్, ప్రసాద్‌బాబు, తారాబాయి, సునీత పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

రాయపోల్, నవంబర్ 12 : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక ప్రాత్ర పోషిస్తాయని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండ లం దొమ్మటలో గ్రామస్తుల సహకారంతో నాలుగు సీసీ కెమెరాలను ప్రారంభించారు. దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్‌దీప్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 12 : శివకేశవులకు అత్యంత ప్రియమైన కార్తిక మాసంలోని ఏకాదశిని పురుస్కరించుకొని మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మద్దూరు, గాగిళ్లాపూర్, బైరాన్‌పల్లి, నర్సాయపల్లి తదితర గ్రామాల్లో తెల్లవారుజామున నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. రాత్రి వేళల్లో ఆలయాల వద్ద సామూహికంగా భజనలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నదాన సేవా సమితికి..



అన్నదాన సేవా సమితి సభ్యులకు విరాళం అందజేస్తున్న దత్తాత్రి కుటుంబ సభ్యులు

జహీరాబాద్, నవంబర్ 12: జహీరాబాద్ పట్టణంలోని అన్నదాన సేవా సమితికి కూతురి పుట్టిరోజు సందర్భంగా తల్లిదండ్రులు విరాళం అందించారు. పట్టణానికి చెందిన బరూర్ దత్తాత్రి ముదిరాజ్ కూతురు శివాని పుట్టిన రోజు కావడంతో మంగళవారం పట్టణంలోని అన్నదాన సేవా సమితి సభ్యులకు నగదును విరాళంగా అందజేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అన్నదాన సేవా సమితి సభ్యులు బెజుగం రాజయ్య, సంగప్ప, పాండయ్య, దత్తాత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తొలగనున్న మురుగు నీటి కష్టాలు

జహీరాబాద్ పట్టణంలోని మూసానగర్‌లో చేపడుతున్న మురుగుకాల్వల నిర్మాణ పనులు

జహీరాబాద్, నవంబర్ 12: జహీరాబాద్ పట్టణంలోని పలు వార్డులో నెలకొన్న మురుగు నీటి కష్టాలు తొలిగిపోనున్నాయి. పట్టణంలోని మూసానగర్ వార్డులో కొంత కాలంగా మురుగు కాల్వలు లేకపోవడంతో నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వార్డులో ప్రజలు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ శాఖాధికారులు వార్డులో మురుగు కాల్వల నిర్మాణానికి నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలను పంపించారు. ఈ మేరకు పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న మురుగు నీటి కష్టాలను తొలిగించేందుకు మున్సిపల్ అధికారులు మురికి కాల్వల నిర్మాణ పనులు చేపడుతున్నారు. మురికి కాల్వల నిర్మాణంతో మురుగు నీటి కష్టాలు తొలిగిపోతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

సంగారెడ్డిలోని శాంతినగర్ పంచముఖి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 12: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆలయాలు సందడిగా మారాయి. సంగారెడ్డి శాంతినగర్ లోని పంచముఖి హనుమాన్, శివాలయంలో కార్తిక దీపోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు శివ లింగానికి రుద్రాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.